సాక్షి
జయశంకర్ భూపాలపల్లి
శనివారం | 7 | డిసెంబర్ | 2024



గూడ్స్ రైలు బోగిలో పొగలు

రామగుండం నుంచి సికింద్రాబాద్ వైపు బొగ్గు లోడ్‌తో వెళ్తున్న గూడ్స్ రైలు బోగి నుంచి పొగలు వచ్చిన సంఘటన స్టేషన్‌ఘన్‌పూర్ రైల్వేస్టేషన్‌లో చోటు చేసుకుంది. - 8లో▸



హైటెక్ హంగులు

అమృత్‌భారత్ పథకంలో భాగంగా కాజీపేట జంక్షన్‌ను కేంద్రం నిధులతో దక్షిణ మధ్య రైల్వే అధికారులు హైటెక్ హంగులతో అత్యాధునీకరిస్తున్నారు. - 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
29.4°/22.2°

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఉంటుంది. రాత్రివేళ చలితో పాటు మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

విశేష పుష్పార్చన



కాళేశ్వరం: రాష్ట్రప్రభుత్వం అభివృద్ధి పథంలో ఉండాలని సంకల్పిస్తూ ప్రజాపాలన దినోత్సవంలో భాగంగా కాళేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. శుక్రవారం శ్రీకాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయ అనుబంధ దేవాలయమైన శ్రీశుభానందదేవి అమ్మవారి ఆలయంలో విశేష పుష్పార్చన పూజా కార్యక్రమాన్ని ప్రధాన అర్చకుడు త్రిపురారి కృష్ణమూర్తిశర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ శ్రీనివాస్, సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం అందించాలి



చిట్యాల: అంగన్‌వాడీ కేంద్రాలలో పిల్లలకు మెరుగైన వసతులతో పాటు పౌష్టికాహారం అందించాలని జిల్లా సంక్షేమ అధికారి చిన్నయ్య అన్నారు. మండలకేంద్రంలోని నాలుగో అంగన్‌వాడీ కేంద్రాన్ని శుక్రవారం ఆయన తనిఖీ చేపట్టారు. అంగన్‌వాడీ కేంద్రంలో సౌకర్యాలు, చిన్నారులకు అందిస్తున్న ఆహార నాణ్యతను పరిశీలించారు. అనంతరం చిన్న పిల్లలతో స్నేహపూర్వకంగా సమయం గడిపి వారితో కలిసి భోజనం చేశారు. అంగన్‌వాడీ కేంద్రంలో భోజనం చేసిన అనంతరం ఇలాగే ప్రతీ రోజు పిల్లలకు పౌష్టికాహారం అందించాలని సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ భాగ్యలక్ష్మి, ఆయా పద్మ ఉన్నారు.

సరస్వతి పుష్కరాలపై నేడు సమావేశం

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో వచ్చే ఏడాది మే 16నుంచి 26వరకు జరగనున్న సరస్వతి నది పుష్కరాలకు శాశ్వత పనులకు నిధుల మంజూరుపై కలెక్టర్ రాహుల్ శర్మ అధ్యక్షతన శనివారం కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించనున్నారు. డిసెంబర్ 2న దేవాదాయశాఖ ముఖ్యకార్యదర్శి శైలజారామయ్యర్ సమావేశం నిర్వహించిన విషయం తెలిసిందే. ఆమె ఆదేశాలతో పుష్కరాలకు వచ్చే భక్తుల సౌకర్యార్థం ముందస్తుగా శాశ్వతంగా ఏర్పాటు చేసే పనులకు ప్రతిపాదనలు చేసి నిధుల కేటాయింపుపై కలెక్టర్ ఆధ్వర్యంలో సంబంధితశాఖ అధికారులతో సమావేశం ఉండనుందని ఈఓ ఏ. మారుతి తెలిపారు.

కాళేశ్వరం దేవస్థానం ఉద్యోగులకు పదోన్నతి

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరం దేవస్థానంలో ఇద్దరు రికార్డు అసిస్టెంట్ ఉద్యోగులకు జూనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పిస్తూ దేవాదాయశాఖ కమిషనర్ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. ఇద్దరు రికార్డు అసిస్టెంట్లు దూది శ్రీనివాస్, తూనూరి రాజయ్యలకు పదోన్నతి వచ్చింది. ఈఓ మారుతిని వివరణ కోరగా జూనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతి ఉత్తర్వులు వెలుబడ్డట్లు పేర్కొన్నారు.

గొడ్డలితో దాడిచేసిన ఇద్దరి రిమాండ్

కాళేశ్వరం: మహదేవపూర్ మండల కేంద్రంలో భూతగాదాలతో మేనల్లుడిపై గొడ్డలితో దాడిచేసిన మామ అతని కుమారుడిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పవన్‌కుమార్ తెలిపారు. గురువారం రాత్రి తుంగల రాజయ్య, అతని కుమారుడు వినయ్ కలిసి సుంకె మహేష్‌పై గొడ్డలితో దాడిచేసిన ఘటనలో తల్లి ఈశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు ఇద్దరిని శుక్రవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

వర్షంతో తడిసిన ధాన్యం



మంగపేట: మండల పరిధిలోని అకినేపల్లిమల్లారం, కమలాపురం, తిమ్మంపేట తదితర గ్రామాల్లో గురువారం రాత్రి కురిసిన భారీ వర్షంతో కల్లాల్లో ధాన్యం రాశులు తడిసి ముద్దయ్యాయి. కొనుగోలు కేంద్రాల్లో స్థలం లేని కారణంగా పలువురు రైతులు ధాన్యాన్ని పొలాలు, రోడ్డు వెంట, ఖాళీ స్థలాల్లో ఆరబెట్టుకున్నారు. ధాన్యం నీళ్లలోనే ఉంటే రంగు మారడంతో పాటు మొలకలు వచ్చే ప్రమాదం ఉండడంతో రైతులు తడిసిన ధాన్యాన్ని ఎత్తి మరో ప్రదేశానికి ట్రాక్టర్లలో తరలించి ఆరబెట్టేందుకు నానా యాతన పడ్డారు. సకాలంలో కూలీలు దొరకకపోవడంతో కొందరు రైతులు నీటిలో ఉన్న ధాన్యం బయటకు తీసేందుకు తీవ్రంగా శ్రమించారు.

సైన్స్ పండుగకు వేళాయె..

నేడు, రేపు జిల్లాస్థాయి సైన్స్ ఫెయిర్

- ఏర్పాట్లు పూర్తిచేసిన అధికారులు



ఏడు అంశాల్లో ప్రదర్శనలు

- ఆహారం, ఆరోగ్యం, పరిశుభ్రత
- రవాణా, కమ్యూనికేషన్
- సహజ వ్యవసాయం
- విపత్తు నిర్వహణ
- మ్యాథమెటికల్ మోడలింగ్
- కంప్యూటేషనల్ థింకింగ్
- వ్యర్థాల నిర్వహణ, రిసోర్స్ మేనేజ్‌మెంట్

ప్రదర్శనకు తీసుకురావాల్సినవి

- ప్రదర్శించే ఎగ్జిబిట్‌ను చూపించాలి
- వెయ్యి పదాలకు మించని అబ్‌స్ట్రాక్ట్ ఉండాలి
- ఎగ్జిబిట్ పేరు, విధానాన్ని తెలిపే చార్టును ప్రదర్శించాలి
- ఎగ్జిబిట్లలో థర్మకోల్, ప్లాస్టిక్‌ను వాడొద్దు

భూపాలపల్లి అర్బన్: విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీసేందుకు సైన్స్ ఎగ్జిబిషన్లు ఎంతగానో దోహదపడుతాయి. విద్యార్థుల ప్రతిభకు నాంది పలుకుతాయి. నేడు (శనివారం), రేపు జిల్లా స్థాయి సైన్స్ (వైజ్ఞానిక ప్రదర్శన) ఎగ్జిబిషన్‌ను నిర్వహించనున్నారు. జిల్లా ఇన్‌చార్జ్ విద్యాధికారి రాజేందర్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. జిల్లాకేంద్రంలోని శాంతినికేషన్ హైస్కూల్‌లో నిర్వహించే ఈ ఎగ్జిబిషన్‌లో జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, కేజీబీవీ, మోడల్, గురుకులాలు, ప్రైవేట్ పాఠశాలల నుంచి ఎగ్జిబిట్లను ప్రదర్శించాలని జిల్లా విద్యాధికారి ఆదేశాలు జారీచేశారు. సుమారు 250 ఎగ్జిబిట్లను ప్రదర్శించే అవకాశం ఉంది. జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రదర్శన కనబర్చిన వారిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేయనున్నారు. జిల్లా నుంచి 14 నమూనాలను రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తారు.

ఉపాధ్యాయుల పర్యవేక్షణలో ఏర్పాట్లు

ఎగ్జిబిట్ల ప్రదర్శన కోసం ఆయా పాఠశాలల ఉపాధ్యాయుల పర్యవేక్షణలో ఏర్పాట్లు చేసుకున్నారు. 8, 9, 10వ తరగతులను సీనియర్ విభాగం గాను 6, 7 తరగతులను జూనియర్ విభాగంగాను ఎంపిక చేశారు. ప్రతీ పాఠశాల నుంచి ఒక్కో అంశానికి ఒక ఎగ్జిబిట్ చొప్పున గరిష్ఠంగా జూనియర్, సీనియర్ విభాగాలను కలుపుకొని రెండు ఎగ్జిబిట్లను ప్రదర్శించవచ్చు. సబ్జెక్టును బోధించే ఉపాధ్యాయుడు ఒక టీఎల్‌ఎమ్‌ను ప్రదర్శించడానికి అవకాశం ఉంటుంది.

టీఎల్‌ఎమ్ ప్రదర్శించే అవకాశం

బీఈడీ, డీఈడీ చేస్తున్న ఛాత్రోపాధ్యాయులు బోధనోపకరణాలను ప్రదర్శించే అవకాశం ఉంటుంది. ఛాత్రోపాధ్యాయులు ప్రదర్శించిన టీఎల్‌ఎమ్ నుంచి రాష్ట్ర స్థాయికి రెండింటిని ఎంపిక చేయనున్నారు. దీంతో జిల్లాలోని బీఈడీ, డీఈడీ కళాశాలల్లో ఛాత్రోపాధ్యాయులు బోధనోపకరణాలను ప్రత్యేక ఆకర్షణతో తయారు చేయనున్నారు.

సమస్యల పరిష్కారానికి ఉపయోగకరం



విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయడంలో సైన్స్ ఎగ్జిబిషన్ ఉపయోగపడుతుంది. ఈ ఎగ్జిబిషన్ సైన్స్ పట్ల ఆసక్తిని పెంపొందిస్తుంది. నిత్యజీవితంలో మనిషికి ఎదురయ్యే సమస్యలకు పరిష్కారాలను కనుగొనేందుకు ఇలాంటి సైన్స్ ఎగ్జిబిషన్లు దోహదపడుతాయి. ప్రతీ పాఠశాల నుంచి రెండు ప్రదర్శనాంశాలను మాత్రమే తీసుకురావాలి. ఉపాధ్యాయుల నుంచి వినూత్న బోధనోపకరణలు సైన్స్ ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించవచ్చు. ప్లాస్టిక్, థర్మకోల్‌తో తయారుచేసిన ఎగ్జిబిట్లను ప్రదర్శించేందుకు తీసుకురావద్దు.

– బర్ల స్వామి, జిల్లా సైన్స్ అధికారి

సైన్స్ ఎగ్జిబిషన్‌తో ఎన్నో ఆవిష్కరణలు



సైన్స్ ఎగ్జిబిషన్‌తో ఎన్నో కొత్త ఆవిష్కరణలు వెలువడుతాయి. సైన్స్ ఎగ్జిబిషన్ విద్యార్థుల్లోని ప్రతిభను, సృజనాత్మకతను వెలికి తీస్తాయి. ప్రతీ పాఠశాల నుంచి కొత్త అంశాలతో కూడిన ఎగ్జిబిట్లను ప్రదర్శించాలి. ఎగ్జిబిట్ల గురించి సందర్శకులకు చక్కగా వివరించాలి. భారీఎత్తున జరిగే ఈ సైన్స్ ఎగ్జిబిషన్‌ను అత్యంత ఆకర్షణీయంగా నిర్వహించనున్నాం. మున్ముందు జిల్లాలో రాష్ట్రస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించేందుకు కృషి చేస్తున్నాం.

– రాజేందర్, జిల్లా ఇన్‌చార్జ్ విద్యాశాఖ అధికారి

విజయవంతానికి సన్నాహక సమావేశం



మాట్లాడుతున్న డీఈఓ రాజేందర్

జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శన విజయవంతం కోసం శుక్రవారం జిల్లా కేంద్రంలోని శాంతినికేతన్ (పాత గుడ్‌మార్నింగ్ స్కూల్) హైస్కూల్‌లో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ ముద్దమల్ల రాజేందర్ మాట్లాడారు. ఆయా కమిటీల కన్వీనర్లు, కో కన్వీనర్లు, సభ్యులు అందరూ సకాలంలో విచ్చేసి జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనను విజయవంతం చేసి మన జిల్లాను రాష్ట్రస్థాయిలో ముందంజలో నిలపాలని పేర్కొన్నారు. తమకు కేటాయించిన బాధ్యతలను పూర్తిస్థాయిలో నెరవేర్చాలని తెలిపారు. వైజ్ఞానిక ప్రదర్శనను తిలకించడానికి విచ్చేసిన విద్యార్థులకు అన్ని సదుపాయాలు కల్పించాలన్నారు. ఈ ప్రారంభ సమావేశానికి భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, కలెక్టర్ రాహుల్ శర్మ హాజరు కానున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో అకడమిక్ మానిటరింగ్ అధికారి కాగితపు లక్ష్మణ్, జిల్లా సైన్స్ అధికారి బర్ల స్వామి, రాజగోపాల్, మండల రవీందర్ రెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ రాజేష్, శనిగరపు భద్రయ్య, వివిధ మండలాల విద్యాశాఖ అధికారులు, కన్వీనర్లు, కోకన్వీనర్లు పాల్గొన్నారు.

సమ్మెబాటలో ‘సమగ్ర శిక్ష’ ఉద్యోగులు



డీఈఓకు సమ్మె నోటీసు అందజేస్తున్న ఉద్యోగులు

భూపాలపల్లి అర్బన్: విద్యాశాఖ సమగ్ర శిక్షలో కాంట్రాక్ట్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు తమను రెగ్యులర్ చెయ్యాలని సమ్మె బాట పడుతున్నారు. ఈమేరకు శుక్రవారం జిల్లా ఇన్‌చార్జ్ విద్యాశాఖ అధికారి రాజేందర్‌ను కలిసి సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు చాంద్ పాషా, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు రేగుల సహదేవ్ మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గతేడాది తమకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. ఉద్యోగ భద్రత లేకుండా నిజ జీవితంలో అనేక ఒడిదొడుకులను ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. సమగ్ర శిక్ష ఉద్యోగులందరిని రెగ్యులర్ చెయాలన్నారు. ప్రతీ ఉద్యోగికి జీవిత బీమా రూ.20లక్షలు, ఆరోగ్య బీమా రూ.10 లక్షల సౌకర్యం కల్పించాలని చెప్పారు. పదవీ విరమణ చేస్తున్న వారికి బెనిఫిట్స్ కింద రూ.25 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ, విద్యాశాఖ నియామకాలలో వెయిటేజ్ కల్పించాలని కోరారు. ఈనెల 10నుంచి నిరవధిక సమ్మెకు పిలుపునిస్తున్నట్లు తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల వేణు, సంఘం జిల్లా బాధ్యులు ఆడెపు చంద్రకళ, మారం మహేందర్, సత్యనారాయణ, వేణు, నరేష్‌కుమార్, రాజు సుదర్శన్, కనక లక్ష్మి, హరీష్, మల్లికార్జున్, పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమం

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం



ఏటూరునాగారంలో ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు, కార్యకర్తలు



మాట్లాడుతున్న తమ్మినేని వీరభద్రం

ఏటూరునాగారం: దేశంలో బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమాలు ఉధృతం చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం పిలుపునిచ్చారు. ఏటూరునాగారం మండల కేంద్రంలో శుక్రవారం సీపీఎం జిల్లా రెండో మహాసభల సందర్భంగా జెడ్పీహెచ్‌ఎస్ నుంచి భారీ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా డీజే సౌండ్స్, డోలి నృత్యాలు చేస్తూ మహాసభ ప్రాంగణానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకటరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన బహిరంగ సభలో తమ్మినేని వీరభద్రం మాట్లాడారు. ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడిదారీ విధానం సంక్షోభంలోకి కూరుకుపోతుందని.. ప్రజలంతా ఎర్రజెండా వైపు చూస్తున్నారన్నారు. దానికి నిదర్శనమే శ్రీలంకలో ఎర్రజెండా రాజ్యాధికారానికి రావడమేనని తెలిపారు. ఏడాది పాలన పూర్తి చేసుకోబోతున్న కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీల అమలును పక్కకు పెట్టి హైడ్రా, మూసి సుందరీకరణ పేరుతో ప్రజా సమస్యలను పక్కదారి పట్టిస్తున్నారన్నారు. భద్రాచలం మాజీ ఎంపీ డాక్టర్ మిడియం బాబురావు మాట్లాడుతూ అర్హులందరికీ ప్రభుత్వం రేషన్ కార్డులు మంజూరు చేయాలన్నారు. సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు సూడి కృష్ణారెడ్డి, నాయకులు బండారు రవికుమార్, మచ్చ వెంకటేశ్వర్లు, పిట్టల రవి, సాంబశివ, రత్నం రాజేందర్, దావూద్, కొప్పుల రఘుపతి, జ్ఞానం వాసు, సౌమ్య, వంక రాములు, చిరంజీవి, సుధాకర్, ఐలయ్య, గఫూర్ పాషా, చిట్టిబాబు, మల్లారెడ్డి, చిటమట రమేష్, యాకూబ్, ప్రసాద్, చిన్న తదితరులు పాల్గొన్నారు.

హోంగార్డుల పనితీరు ప్రశంసనీయం

- ఆర్మ్‌డ్ రిజర్వు అదనపు ఎస్పీ వేముల శ్రీనివాస్



మాట్లాడుతున్న శ్రీనివాస్

భూపాలపల్లి: పోలీసు శాఖలో హోంగార్డుల పనితీరు ప్రశంసనీయమని ఆర్మ్‌డ్ రిజర్వు అదనపు ఎస్పీ వేముల శ్రీనివాస్ అన్నారు. హోంగార్డు ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం జిల్లాఆర్మ్‌డ్ రిజర్వు ప్రధాన కార్యాలయంలో ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఏఆర్ అదనపు ఎస్పీ శ్రీవివాస్ హాజరై మాట్లాడారు. పోలీస్ శాఖలో ఒక భాగమై, పోలీసులతో సమానంగా నిరంతరం విధులు నిర్వర్తిస్తూ హోంగార్డులు అందిస్తున్న సేవలు కొనియాడదగినవన్నారు. విధినిర్వహణలో హోంగార్డ్‌లు అంకితభావంతో శాంతిభద్రతల పరిరక్షణలో బాధ్యతాయుతమైన సేవలు అందిస్తున్నారని పేర్కొన్నారు. నిత్యం క్రమశిక్షణతో మెలుగుతూ పోలీసు శాఖ ప్రతిష్టను మరింత పెంచేలా విధులు నిర్వర్తించాలని, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. ఆరోగ్య సూత్రాలు పాటిస్తూ, తమ కుటుంబాన్ని పరిరక్షించుకోవాలని హోంగార్డులకు సూచించారు. ఈ కార్యక్రమంలో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు నగేష్, రత్నం, ఆర్ఎస్సై సురేందర్‌రెడ్డి, పోలీసు అధికారుల సంఘం నేత యాదిరెడ్డి, జిల్లా హోంగార్డు పాల్గొన్నారు.

రాష్ట్రంలో అగ్రగామిగా నిలుపుతా

- భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు
- 100 ఫీట్ల రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన



రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

గణపురం: భూపాలపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో సమగ్రాభివృద్ధి చేసి రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలుపుతానని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. గణపురం మండలకేంద్రంలో రూ.18 కోట్లతో నాలుగులైన్ల రోడ్డు నిర్మాణ పనులు, డ్రెయినేజీ నిర్మాణంతో పాటు పలు పనులకు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో గణపురం మండలకేంద్రంలో రెండు లైన్ల రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేస్తామని తెలిపారు. గణపురం మండలానికి ప్రత్యేక నిధులు తీసుకువచ్చి అభివృద్ధి చేస్తానన్నారు. ఇప్పటికే గణపసముద్రం చెరువును పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు పనులు ప్రారంభించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

మహిళా రైతుల ఆందోళన



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

మొగుళ్లపల్లి: నేషనల్ హైవే కోసం తమ భూములను ఎట్టి పరిస్థితుల్లో ఇవ్వబోమని ఇస్సిపేట గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో శుక్రవారం మహిళా రైతులు తహసీల్దార్ సునీత ఎదుట ఆందోళన చేపట్టారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ గ్రీన్ ఫీల్డ్ హైవే కింద కోల్పోతున్న వివిధ గ్రామాల్లో ఉన్న భూములకు ఇస్సిపేట గ్రామ శివారులోని భూములకు చాలా వ్యత్యాసం ఉందన్నారు. ఇక్కడి హైవే కిందపోతున్న భూములు సారవంతమైనవన్నారు. భూములు కోల్పోతే ఆత్మహత్యలే శరణ్యమన్నారు. భూములు తీసుకుంటే ఎకరానికి కోటి రూపాయల చొప్పున చెల్లించాలన్నారు. టోల్ రుసుము కింద 75శాతం జీవన భృతి నిరాదరణగా ఇవ్వాలని.. కుటుంబంలో చదువుకున్న వారికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భూములను కాపాడుకోవడానికి ప్రాణత్యాగాలకైనా వెనుకడుగు వేయబోమన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు రాంరెడ్డి, వీరారావు, ముత్తిరెడ్డి, సౌందర్య, అశ్విని, అన్నారెడ్డి, కొమురెల్లి, సుధాకర్‌రెడ్డి, సమ్మయ్య పాల్గొన్నారు.

రూ.3.86 కోట్లు



కలెక్టర్ గ్రాంట్ నుంచి మినీ మేడారానికి నిధులు

- మౌలిక వసతులు కల్పించేందుకు మంజూరు
- వచ్చే ఏడాది ఫిబ్రవరి 12 నుంచి 15 వరకు జాతర
- తల్లుల దర్శనానికి తరలిరానున్న లక్షలాది మంది భక్తులు

ఎస్ఎస్‌తాడ్వాయి: మేడారం మినీ జాతరలో భక్తుల సౌకర్యార్థం వివిధ పనులు చేపట్టేందుకు ప్రభుత్వం కలెక్టర్ గ్రాంటు నుంచి రూ.3,86,45,000 నిధులను మంజూరు చేసింది. వచ్చే ఏడాది ఫిబ్రవరి 12నుంచి 15 వరకు నాలుగు రోజుల పాటు మినీ మేడారం జాతర జరగనుంది. ఈ జాతరకు రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల నుంచి భక్తులు హాజరు కానున్నారు. జాతరకు వచ్చే భక్తుల సౌకర్యార్థం చేపట్టనున్న ఏర్పాట్ల కోసం మంత్రి సీతక్క పలుమార్లు జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆయా శాఖల ద్వారా కేటాయించిన నిధులతో త్వరలో పనులు చేపట్టేందుకు జిల్లా అధికార యంత్రాంగం సిద్ధమవుతోంది. జాతరకు ముందుగానే ఏర్పాట్లు చేస్తే ముందస్తుగా మేడారానికి వచ్చే భక్తులకు సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని పూజారులు అభిప్రాయపడుతున్నారు.

మేడారంలో ఏర్పాట్లు ఇలా..

మేడారం మినీ జారతలో భక్తులకు వివిధ సౌకర్యాలు కల్పించేందుకు జిల్లా అధికార యంత్రాంగం సిద్ధమవుతోంది. రూ.3.86 కోట్ల నిధులతో మేడారంలోని ఐటీడీఏ అతిథిగృహం, రెవెన్యూ అతిథి గృహం మరమ్మతులు చేపట్టనున్నారు. తాగునీరు, పారిశుద్ధ్యం, మరుగుదొడ్ల మరమ్మతులు చేయనున్నారు. మేడారంలోని భక్తుల విడిది కోసం షెడ్లు, షాపింగ్ కాంప్లెక్స్ గదుల మరమ్మతులు చేపట్టనున్నారు. జాతరలో విద్యుద్దీపాల ఏర్పాట్లతో పాటు కాల్వపల్లి నుంచి కన్నెపల్లి వరకు ఎడ్లబండ్ల దారులను మరమ్మతు చేయనున్నారు. మేడారం పరిసరాల ప్రాంతాల్లోని బోరుబావులను ఫ్లషింగ్, బ్యాటరీ ఆఫ్ ట్యాప్స్, పార్కింగ్ స్థలాల ఏర్పాట్ల పనులు చేపట్టనున్నారు. ఊరట్టం నుంచి కొండాయి వరకు రోడ్డు మరమ్మతులు చేపడతారు. ఐలాపూర్‌లో సమ్మక్క గుడి వద్ద మరుగుదొడ్ల నిర్మాణం, కొండాయిలో గోవిందరాజుల గుడికి రంగులు వేయనున్నారు.

నెలరోజుల నుంచే భక్తుల తాకిడి

మేడారం మినీ జాతరకు సంక్రాంతి పండుగ నుంచే భక్తులు వేలాదిగా తరలిరానున్నారు. సంక్రాంతి పండుగకు ప్రభుత్వం పాఠశాలలకు సెలవులు ప్రకటించడంతో భక్తుల రద్దీ పెరిగే అవకాశం ఉంది. ఈ జాతరకు సుమారు 10 లక్షల మంది భక్తులు హాజరవుతారని అధికారుల అంచనా. ముందస్తుగా మేడారం మినీ జాతరకు తరలివచ్చే భక్తులు సౌకర్యాలలేమితో ఇబ్బందులు పడుతుంటారు. ఈసారి సంక్రాంతి పండుగ వరకు భక్తులకు అన్ని అందుబాటులోకి రానున్నాయి. ప్రధానంగా తాగునీరు, శాశ్వతంగా నిర్మించిన మరుగుదొడ్లను వినియోగంలోకి తీసుకురావాలని భక్తులు కోరుతున్నారు. పూజారుల విశ్రాంతి భవనం నిర్మాణం పనులను త్వరగా పూర్తి చేసి మినీ జాతరకు పూజారులకు అందుబాటులోకి తీసుకువచ్చేలా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని పూజారులు కోరుతున్నారు.

శాఖల వారీగా నిధుల కేటాయింపు ఇలా..

ట్రైబల్ వెల్ఫేర్	- రూ.1.72 కోట్లు
మిషన్ భగీరథ(ఇంట్రా)	- రూ.24.70 లక్షలు
విద్యుత్‌శాఖ	- రూ.42 లక్షలు
పీఆర్	- రూ.18.83 లక్షలు
జిల్లా పంచాయతీరాజ్‌శాఖ	- రూ.81.52 లక్షలు
మత్స్యశాఖ	- రూ.5 లక్షలు
అటవీశాఖ	- రూ.20 లక్షలు
డీడబ్ల్యూఓ	- రూ.5 లక్షలు
ఇరిగేషన్	- రూ.12.90 లక్షలు
పౌర సంబంధాల శాఖ	- రూ.4.50 లక్షలు
మొత్తం	రూ. 3,86,45,000

పనులు త్వరగా చేపట్టాలి..



జాతరకు నెల రోజుల ముందు నుంచే అమ్మవార్లకు మొక్కులు చెల్లించుకునేందుకు భక్తులు వేలాదిగా తరలివస్తారు. జాతరకు వచ్చే భక్తులకు అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేయాలి. మినీ జాతరకు రూ.3.86 కోట్ల నిధులు కేటాయించడం చాలా సంతోషం, మంత్రి సీతక్క, కలెక్టర్ దివాకరకు కృతజ్ఞతలు.

– సిద్ధబోయిన జగ్గారావు
పూజారుల సంఘం అధ్యక్షుడు

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

- రూ.15లక్షల మేర ఆస్తి నష్టం



అగ్ని ప్రమాదంతో కాలిపోయిన నగదు

టేకుమట్ల: విద్యుదాఘాతంతో ఇల్లు దగ్ధమైన సంఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలంలోని రామకిష్టాపూర్ (వి)లో శుక్రవారం చోటుచేసుకుంది. బాధితుడు ఎడ్ల పోశాలు కథనం ప్రకారం.. శుక్రవారం ఇంట్లోని ఫ్రిడ్జి పేలడంతో మంటలు చెలరేగి పక్కనే ఉన్న నూనె క్యాన్‌కు అంటుకోవడంతో మంటలు మరింత వ్యాపించి ఇల్లు మొత్తం దగ్ధమైంది. మంటలను ఆర్పేందుకు ఎంత ప్రయత్నించినా దట్టమైన పొగ, మంటలు వ్యాపించడంతో సాధ్యం కాలేదు. దీంతో ఇంట్లోని గృహోపకరణాలు, 12 తులాల బంగారం, వెండి, బట్టలు, బియ్యం, రూ.4లక్షల నగదు పూర్తిగా కాలిపోయినట్లు తెలిపారు. అగ్ని ప్రమాదంలో సుమారు రూ.15 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు తెలిపారు. ఇల్లు పూర్తిగా దగ్ధం కావడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు. విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు బాధితుడిని పరామర్శించి ప్రభుత్వం నుంచి సాయం అందిస్తామని భరోసా కల్పించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కోటగిరి సతీష్‌గౌడ్, నాంపెల్లి వీరేశం తదితరులు ఉన్నారు.

ముగ్గురు వేటగాళ్ల అరెస్ట్


అరెస్టు చూపిస్తున్న ఫారెస్ట్ అధికారులు

భూపాలపల్లి రూరల్: భూపాలపల్లి మండలంలోని కమలాపూర్ గ్రామంలో ముగ్గురు వేటగాళ్లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు భూపాలపల్లి రేంజ్ ఆఫీసర్ నరేష్ తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఫారెస్టు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. పక్కా సమాచారం మేరకు అటవీ శాఖ అధికారులు కమలాపూర్ గ్రామంలో ముగ్గురు వ్యక్తులను అదుపులో తీసుకుని విచారించగా మొత్తం నలుగురు వ్యక్తులు కలిసి దుప్పిని వేటాడి మాంసం విక్రయించేవారని నేరం ఒప్పుకున్నారు. దీంతో మందారపు సారయ్య, మాందారపు రాములు, భీముని భిక్షపతి, ఏమేని ఐలయ్యలను అరెస్ట్ చేసి వన్య ప్రాణులు చట్టం 1972 ప్రకారం కేసు నమోదు చేసి భూపాలపల్లి కోర్టులో రిమాండ్ చేసినట్లు ఆయన తెలిపారు.

హైటెక్ హంగులు


హైటెక్ హంగులతో కాజీపేట జంక్షన్ నమూనా


అప్పర్‌క్లాస్ వెయిటింగ్‌హాల్ నమూనా

కాజీపేట జంక్షన్‌కు 'అమృత్ భారత్' నిధులు
- జంక్షన్‌కు అత్యాధునిక అందాలతో ఆధునీకరణ
- 120 ఏళ్ల చరిత్ర గల కాజీపేట స్టేషన్
- వరల్డ్ క్లాస్ రైల్వే స్టేషన్‌గా రీమోడలింగ్
- స్టేషన్ ఎదుట రైల్ కోచ్ రెస్టారెంట్
- ప్లాట్‌ఫాంల విస్తరణ.. మరో రెండు అదనపు ప్లాట్‌ఫాంలు

కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్‌ను అమృత్ భారత్ పథకంలో భాగంగా కేంద్రం నిధులతో దక్షిణ మధ్య రైల్వే అధికారులు హైటెక్ హంగులతో అత్యాధునీకరిస్తున్నారు. 1904లో నిర్మించిన నాటి కాజీపేట రైల్వే స్టేషన్ దినదినాభివృద్ధి చెంది నేడు ఉత్తర, దక్షిణ దేశ ప్రాంతాలకు గేట్ వేగా ఉంటుంది.


ప్రస్తుత కాజీపేట జంక్షన్‌లోని ప్లాట్‌ఫాంలు

120 ఏళ్ల చరిత్ర గల అతిపురాతన కాజీపేట రైల్వే స్టేషన్ రైల్వేపరంగా కాజీపేట నుంచి ఢిల్లీ వరకు ఎంతో ప్రాధాన్యత సంతరించుకున్న కాజీపేట జంక్షన్‌ను వరల్డ్‌క్లాస్ రైల్వే స్టేషన్‌గా అత్యాధునీకరించేందుకు కేంద్రం అమృత్‌భారత్ నిధులతో శ్రీకారం చుట్టింది. గ్రానైట్‌రాయితో నిర్మాణాలు, కొత్త కొత్త డిజైన్‌లతో రైల్వే కట్టడాలు, ఎంతో అందాన్నిచ్చే పేయింటింగ్స్, గ్రీనరీ గార్డెన్స్ ఏర్పాటుతో కాజీపేట జంక్షన్ న్యూ లుక్‌తో ప్రయాణికులు కొద్ది నెలల్లో చూడబోతున్నారు.

కొనసాగుతున్న అభివృద్ధి పనులు

అమృత్‌భారత్ నిర్మాణ పనుల్లో భాగంగా రైల్వే స్టేషన్ ఎంట్రెన్స్‌లో పోర్టికో, ప్రయాణికులకు అప్పర్‌క్లాస్ వెయిటింగ్ హాల్ నిర్మాణం, ప్లాట్‌ఫాంల విస్తరణ, న్యూ టాయిలెట్స్ బ్లాక్, రైల్వే అధికారుల కార్యాలయాలు, గ్రీన్ గార్డెన్, వాహనాల రోడ్స్, పాత్‌వే, పార్కింగ్, సర్క్యులేషన్ ఏరియా స్మూత్ ట్రాఫిక్ ఫ్లో, రెండు లిఫ్టులు, 3 ఎస్కలేటర్లు, ప్యాసింజర్ ఫ్రెండ్లీ సైన్ బోర్డులు, నూతన నిర్మాణాలు, రైలు కోచ్‌తో రెస్టారెంట్ హోటల్, కమర్షియల్ డెవలప్‌మెంట్ నిర్మాణాలు జరుగుతున్నాయి. అలాగే కాజీపేట జంక్షన్‌లో 100 ఏళ్ల కాలం నాటి ఫుట్ ఓవర్ బ్రిడ్జిని తొలగించి అదే స్థలంలో నూతనంగా మోడల్ ఫుట్ ఓవర్ బ్రిడ్జిని నిర్మిస్తున్నారు. ప్లాట్‌ఫాంల ఆధునీకరణ పనులు, రైల్వే స్టేషన్ వరకు పూర్తి స్థాయిలో కవర్ షెడ్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. జంక్షన్ నుంచి కాజీపేట చౌరస్తా వరకు అభివృద్ధి నిర్మాణ పనులు అబ్బురపరిచే విధంగా చేపడుతున్నారు. కాజీపేట చౌరస్తా నుంచి ప్రయాణికులు రైల్వే స్టేషన్ లోపలికి వెళ్లే ఎంట్రెన్స్, రైల్వే స్టేషన్ వరకు ఎటు చూసిన ప్రపంచ స్థాయి పర్యాటక కేంద్రానికి వచ్చినట్లుగా అన్ని హంగులతో నిర్మిస్తున్నారు. అన్ని విధాల రినోవేషన్ పనులు పూర్తి చేసి కాజీపేట జంక్షన్‌ను వచ్చే నెల (జనవరి)లో ప్రారంభించేందుకు రైల్వే అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

మొత్తం 5 ప్లాట్‌ఫాంలు..


జంక్షన్‌లో నిర్మాణ దశలో మోడల్ ఫుట్‌ఓవర్‌బ్రిడ్జి

ఉత్తర తెలంగాణలో అతిప్రధానమైన కాజీపేట జంక్షన్ రైల్వే ప్లాట్‌ఫాంల విస్తరణకు రైల్వే అధికారులు శ్రీకారం చుట్టారు. ఈ మేరకు ప్లాట్‌ఫాంల విస్తరణ పనులను దక్షిణ మధ్య రైల్వే అధికారులు త్వరలో చేపట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నారని స్థానిక రైల్వే అధికారులు తెలిపారు. కాజీపేట జంక్షన్ నుంచి ప్రతీ రోజు వివిధ ప్రాంతాలకు సుమారు 20 వేల మంది ప్రయాణికులు రాకపోకలు చేస్తున్నారు. న్యూఢిల్లీ, చెన్నై, హైదరాబాద్ నుంచి వచ్చి వెళ్లే అప్ అండ్ డౌన్ రైళ్లకు ముఖ్య కూడలిగా కాజీపేట జంక్షన్ ఉంది. వివిధ రూట్‌ల నుంచి కాజీపేట జంక్షన్‌కు వచ్చి వెళ్లే ప్రయాణికుల రైళ్లతో పాటు గూడ్స్ రైళ్ల రవాణా ట్రాఫిక్‌తో రైల్వే స్టేషన్‌లో ప్రస్తుతం ఉన్న 1, 2, 3వ నంబర్ ప్లాట్‌ఫాంలు బిజీ బిజీగా మారి సరిపోవడం లేదు. రైళ్ల రద్దీతో రైళ్లను అవుటర్ సిగ్నల్స్ వద్ద నిలిపేయాల్సి వస్తుంది. నిర్ణీత సమయానికి రావాల్సిన రైళ్లు ఆలస్యం కావడంతో పాటు ప్రయాణికుల సమయం వృథా అవుతుంది. దీంతో అదనపు ప్లాట్‌ఫాంల విస్తరణకు ప్రతిపాదనలు పంపిన అధికారులు మరో రెండు (4, 5వ నంబర్) ప్లాట్‌ఫాంలు త్వరలో అందుబా టులోకి రానున్నాయి. కాజీపేట జంక్షన్ నుంచి ప్రయాణించే రైళ్లతో పాటు కాజీపేట మీదుగా వివిధ మార్గాలకు ప్రయాణించే పలు రైళ్లకు ట్రాఫిక్ సమస్య ఉండదని రైల్వే అధికారులు అంటున్నారు.

అంతర్జాతీయ త్రోబాల్ పోటీల్లో బంగారు పతకం


గోల్డ్‌మెడల్ అందుకుంటున్న జ్యోతి

పలిమెల : కాంబోడియాలో జరిగిన అంతర్జాతీయ పారా త్రోబాల్ పోటీల్లో భారత జట్టు ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించింది. ఈ జట్టులో జేఎస్ భూపాలపల్లి జిల్లా పలిమెల మండలానికి చెందిన కావేరి జ్యోతి పాల్గొని దేశం తరఫున ఆడి బంగారు పతకం సాధించడంతో స్థానికుల హర్షం వ్యక్తం చేస్తున్నారు. భవిష్యత్‌లో మరెన్నో విజయాలు సాధించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

చేపల చెరువు పరిశీలన


చేపల చెరువును పరిశీలిస్తున్న రాజన్న

మామునూరు: ఖిలా వరంగల్ మండలం బొల్లికుంట పరిసరాల్లో ఫోర్ట్‌రోడ్డు ప్రాంతానికి చెందిన సిద్ధం రాము ఏర్పాటు చేసిన చేపల చెరువును శుక్రవారం మామునూరు కృషి విజ్ఞాన కేంద్రం మత్స్య శాస్త్రవేత్త డాక్టర్ గణేష్‌తో కలిసి కో ఆర్డినేటర్ డాక్టర్ రాజన్న పరిశీలించారు. శీతాకాలంలో కొర్ర మీను చేపలకు తీసుకోవాల్సిన మేత యాజమాన్య పద్ధతులను వివరించారు. చెరువు నీటి ఉష్ణోగ్రత తగ్గడంతో చేపల్లో రోగ నిరోధక శక్తి తగ్గుతుందని సూక్ష్మ పోషకాలైన విటమిన్లు, ఖనిజ లవణాల మిశ్రమాన్ని చేపల దానాతో పాటు కలిపి వినియోగించాలని మత్స్యకారులకు సూచించారు. అనంతరం రైతు సిద్ధం రాముకు చేప ఎదుగుదలకు గ్రోత్ ప్రమోటర్ మందును శాస్త్రవేత్తలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాజు, రైతులు పాల్గొన్నారు

సీపీఎస్ అమలుకు నిరవధిక నిరాహార దీక్ష

- ఎమ్మెల్సీ అభ్యర్థి పూల రవీందర్


సమావేశంలో మాట్లాడుతున్న పూల రవీందర్

జనగామ రూరల్: సీపీఎస్ సాధనకు నిరవధిక నిరాహార దీక్షకు సిద్ధంగా ఉన్నానని ఎమ్మెల్యే అభ్యర్థి పూల రవీందర్ అన్నారు. శుక్రవారం జనగామ పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగిన ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాల సంయుక్త సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సీపీఎస్ రద్దు కోసం ఎంతటి పోరాటానికైనా సిద్ధమని, కేజీబీవీ, ఎస్ఎస్ఏ ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న సీఆర్‌పీలకు కనీస వేతన చట్టం వర్తింపజేయాలన్నారు. కార్పొరేట్ వైద్యసేవలతో కూడిన హెల్త్‌కార్డులు అందించాలన్నారు. గిరిజన సంక్షేమశాఖలో పండిట్, పీఈటీ పోస్టులను అప్‌డేషన్ చేయాలన్నారు. గురుకుల పాఠశాలల పని వేళలను ఉదయం 9 గంటల నుంచి ప్రారంభం అయ్యేటట్లు ఉత్తర్వులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జాక్టో చైర్మన్ సదానందం గౌడ్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాటం చేస్తున్న పూల రవీందర్‌ను మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో చాప్టర్ జనరల్ సెక్రటరీ కె. కృష్ణుడు, ఎండీ అబ్దుల్లా, హేమచంద్రుడు దానయ్య, రాధాకృష్ణ, సచ్చిదానందరెడ్డి, నగేష్ యాదవ్, బీసీటీఏ జనగాం జిల్లా ప్రెసిడెంట్ ఎలికట్ల యాదగిరి, జనరల్ సెక్రటరీ మామిండ్ల అంజయ్య, ఉపాధ్యక్షుడు మండల సుభాష్, నీలం వేణు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ స్ఫూర్తికి విఘాతం కలిగిస్తున్న కేంద్రం

- సీపీఐ ఎంఎల్ లిబరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య


సమావేశంలో మాట్లాడుతున్న దీపాంకర్ భట్టాచార్య

వరంగల్: రాజ్యాంగ స్ఫూర్తికి బీజేపీ ప్రభుత్వం విఘాతం కలిగిస్తోందని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య అన్నారు. శుక్రవారం ఆజంజాహి మిల్లు గ్రౌండ్‌లో జరిగిన సమావేశంలో వరంగల్ జిల్లా కార్యదర్శి అక్కెనపల్లి యాదగిరి అధ్యక్షత వహించగా తొలుత అమరవీరులకు నివాళులర్పించారు. ఆజం జాహి మిల్లు గ్రౌండ్ నుంచి పోచమ్మ మైదాన్ వరకు ర్యాలీ నిర్వహించారు. కాశిబుగ్గ సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పార్టీ జాతీయ కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..అణగారిన వర్గాల అభ్యున్నతికి, మానవ హక్కుల కోసం పోరాడి స్వేచ్ఛ సమానత్వం సౌభ్రాతృత్వం అనే విలువలు కాపాడేందుకు రాజ్యాంగంలో పొందుపరిచిన మహనీయుడు అంబేడ్కర్ అన్నారు. ఈ కార్యక్రమంలో పొలిట్ బ్యూరో సభ్యులు శంకర్, కేంద్ర కమిటీ సభ్యుడు ఎస్ మూర్తి, రాష్ట్ర కార్యదర్శి మామిండ్ల రమేష్ రాజా, రొయ్యల రాజు, శ్రీనివాస్, గుమ్మడి రాజుల సాంబయ్య, గోల్కొండ కుమార్, మారేపల్లి మల్లేష్, రజిత, ఖాజా మొహినుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

గూడ్స్ రైలుబోగిలో పొగలు


గూడ్స్ రైలుబోగి నుంచి వెలువడుతున్న పొగ

స్టేషన్‌ఘన్‌పూర్: రామగుండం నుంచి సికింద్రాబాద్ వైపు బొగ్గు లోడ్‌తో వెళ్తున్న గూడ్స్ రైలుబోగి నుంచి పొగలు వచ్చిన సంఘటన స్టేషన్‌ఘన్‌పూర్ రైల్వేస్టేషన్‌లో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. బొగ్గు లోడ్‌తో వైటీపీ 4 అనే గూడ్స్ రైలు రామగుండం నుంచి సికింద్రాబాద్ వైపు వెళ్తుంది. ఈ క్రమంలో మధ్యాహ్నం 2 గంటల సమయంలో రైలు స్టేషన్‌ఘన్‌పూర్‌కు చేరుకోగా ఓ బోగి నుంచి పొగలు వస్తున్న విషయాన్ని రైల్వే సిబ్బంది గమనించి స్టేషన్‌మాస్టర్‌కు సమాచారం అందించగా రైలును ఘన్‌పూర్ రైల్వేస్టేషన్‌లో నిలిపి ఫైరింజన్‌కు సమాచారం అందించారు. ఫైర్‌స్టేషన్ జమీందార్ లింగయ్య, ఫైర్‌మన్ గణేష్ ఫైరింజన్‌తో రైల్వే ఒకటవ ప్లాట్‌ఫారంపైకి వచ్చారు. అయితే రైలు రైల్వేవిద్యుత్ మెయిన్‌లైన్‌లో ఉండటంతో విద్యుత్ సరఫరా నిలిపివేసేందుకు సంబంధిత కంట్రోలర్‌కు స్టేషన్‌మాస్టర్ సమాచారం అందించారు. విద్యుత్ సరఫరా నిలిపేసిన అనంతరం ఫైర్ ఇంజన్ సిబ్బంది రైలు బోగిలో నీటిని కొట్టగా పొగలు తగ్గిపోయాయి. అయితే బొగ్గు లోడ్ కావడంతో వేడితో బొగ్గు అంటుకుని పొగలు వ్యాపించి ఉంటాయని రైల్వే సిబ్బంది అభిప్రాయపడుతున్నారు. సకాలంలో సిబ్బంది గమనించి మంటలను ఆర్పడంతో ప్రమాదం తప్పిందని రైల్వే అధికారులు తెలిపారు.

ముగిసిన రైల్వే ఎన్నికలు

- 12న ఫలితాలు


పోలింగ్ శిబిరం వద్ద మురళీకృష్ణ, నాయకులు

కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్‌లో ప్రతిష్టాత్మకంగా రైల్వే గుర్తింపు సంఘం కోసం రెండు రోజుల పాటు జరిగిన రైల్వే వన్ ఇండస్ట్రీ వన్ యూనియన్ ఎన్నికలు శుక్రవారం ముగిశాయి. ముగింపులో రైల్వే రన్నింగ్‌స్టాఫ్ నుంచి లోకోపైలెట్లు, అసిస్టెంట్ లోకో పైలెట్లు, ఆపరేటింగ్ డిపార్ట్‌మెంట్ నుంచి ట్రైన్ మేనేజర్లు (గార్డులు) పోలింగ్ సెంటర్లకు వచ్చి తమ ఓటును వినియోగించుకున్నారు. రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ సికింద్రాబాద్ డివిజన్ ప్రెసిడెంట్ కొత్త మురళీకృష్ణ పోలింగ్ శిబిరాలను సందర్శించి సంఘ నాయకులను కలిసి ఓటింగ్ సరళిని తెలుసుకున్నట్లు రైల్వే సంఘ్ నాయకులు తెలిపారు. రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ కాజీపేట లోకో రన్నింగ్ బ్రాంచీ వర్కింగ్ చైర్మన్ పాక రాజ్‌కుమార్ మాట్లాడుతూ కాజీపేటలో లోకోపైలెట్లు, ట్రైన్ మేనేజర్లు కలిపి 848 మంది ఓటర్లు ఉండగా 780 ఓట్లు పోలైనట్లు తెలిపారు. కాజీపేట జంక్షన్‌లో మొత్తం 3,474 ఓటర్లు ఉండగా మూడు రోజుల ఎన్నికలో 3,148 ఓట్లు పోలైనట్లు (91 శాతం) తెలిపారు. రైల్వేలో గుర్తింపు సంఘం కోసం జరుగుతున్న ఎన్నికల ఫలితాలను ఈ నెల 12వ తేదీన ప్రకటించనున్నారు.

పరీక్షల నియంత్రణాధికారిగా బాధ్యతల స్వీకరణ


రాజేందర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న పరీక్షల విభాగం అధికారులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరీక్షల నియంత్రణాధికారిగా కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కట్ల రాజేందర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి. అమరవేణి, ప్రొఫెసర్ నర్సింహాచారి, అధ్యాపకులు డాక్టర్ ఫణీంద్ర, పరిశోధక విద్యార్థులు శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు. అలాగే పరీక్షల విభాగంలో అదనపు పరీక్షల నియంత్రణాధికారులు డాక్టర్ తిరుమలాదేవి, డాక్టర్ సౌజన్య, నాగరాజులు రాజేందర్, మాజీ పరీక్షల నియంత్రణాధికారి నర్సింహాచారిని సన్మానించి అభినందనలు తెలిపారు.

రిజిస్ట్రార్‌ను అడ్డుకున్న విద్యార్థిసంఘాలు


అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న రిజిస్ట్రార్ మల్లారెడ్డి

కేయూ క్యాంపస్: డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ వర్ధంతిని నిర్వహించడంలో యూనివర్సిటీ అధికారులు ఆలస్యం చేశారని మండి పడుతూ వివిధ విద్యార్థిసంఘాల నాయకులు రిజిస్ట్రార్ మల్లారెడ్డిని అడ్డుకున్నారు. వివరాలిలా ఉన్నాయి... శుక్రవారం కేయూ రిజిస్ట్రార్ ఆచార్య పి. మల్లారెడ్డి ఉదయం 11.45 గంటలకు దూరవిద్యాకేంద్రం వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసేందుకు రాగా పలు విద్యార్థి సంఘాల బాధ్యులు అడ్డుకొని ఉదయమే కార్యక్రమానికి రావాల్సి ఉండగా ఇంత ఆలస్యంగా ఎందుకు వచ్చారని ప్రశ్నిస్తూ పూలమాల వేయకుండా అడ్డుకున్నారు. యూనివర్సిటీ అధికారుల తీరుపై మండిపడుతూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మల్లారెడ్డి మాట్లాడుతూ కేయూ ఎస్సీ, ఎస్టీ సెల్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించాల్సి ఉండేదని, డైరెక్టర్ అందుబాటులో లేకపోవడంతో అంబేడ్కర్ వర్ధంతి ఉందని తెలుసుకొని కార్యక్రమ నిర్వహణకు వచ్చానని రిజిస్ట్రార్ తెలిపారు. అలాగే దూరవిద్యాకేంద్రం డైరెక్టర్ ఆచార్య వి. రాంచంద్రంకు కూడా సమాచారం ఇచ్చామన్నారు. విద్యార్థిసంఘాల బాధ్యులకు సర్దిచెప్పిన తర్వాత రిజిస్ట్రార్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

అంబేడ్కర్ ఆశయాలను కొనసాగించాలి..


అంబేడ్కర్ ఆశయాలను కొనసాగించాలని రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డి అన్నారు. బాబాసాహెబ్ వర్ధంతి సందర్భంగా దూరవిద్యాకేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో దూరవిద్యాకేంద్రం డైరెక్టర్ ఆచార్య రాంచంద్రం, కేయూ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఈసం నారాయణ, మహిళా ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.బిక్షాలు, కేయూ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ డాక్టర్ పుల్లా శ్రీనివాస్, ఆచార్య గాదె సమ్మయ్య, రిటైర్డ్ ఆచార్యులు సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఫొటోగ్రాఫర్ మృతి


శివకుమార్ (ఫైల్)

కాటారం: వివాహ శుభ కార్యానికి ఫొటోలు తీయడానికి వెళ్తూ ఓ యువ వీడియోగ్రాఫర్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దపల్లి జిల్లా ధర్మాబాద్‌కు చెందిన ఆడెపు శివకుమార్ (21) అనే యువకుడు వీడియోగ్రాఫర్ వృత్తి చేస్తూ ఉపాధి పొందుతున్నాడు. శుక్రవారం భూపాలపల్లిలో జరిగే ఓ వివాహ శుభకార్యానికి ఫొటోలు, వీడియో తీయడానికి శ్రీసోని ఫొటో స్టూడియో యజమాని గంధం వీరస్వామితో కలిసి ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. కాటారం మండల కేంద్రానికి సమీపంలోకి చేరుకోగానే ద్విచక్ర వాహనం ముందు వెళ్తున్న టిప్పర్ అకస్మాత్తుగా యూటర్న్ తీసుకోవడంతో బైక్ వెనకనుంచి ఢీకొట్టింది. దీంతో బైక్ నడుపుతున్న వీరస్వామి, వెనకాల కూర్చున్న శివకుమార్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు క్షతగాత్రులను చికిత్స నిమిత్తం స్థానిక ఆస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం పెద్దపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ శివకుమార్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి సోదరుడు రోహిత్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అభినవ్ తెలిపారు.

తాటి చెట్టు పైనుంచి జారి పడి వ్యక్తి..


కేశగాని వీరయ్య (ఫైల్)

తొర్రూరు రూరల్: తాటి చెట్టు పైనుంచి జారి పడి గీత కార్మికుడు మృతి చెందిన ఘటన శుక్రవారం మండల పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై ఉపేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని నాంచారిమడూరు గ్రామానికి చెందిన గీత కార్మికుడు కేశగాని వీరయ్య (57) గీత వృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాడు. రోజువారీలాగే గ్రామ శివారులో కల్లు తీసేందుకు తాటి చెట్టు ఎక్కాడు. చెట్టు పైభాగం వరకు వెళ్లిన క్రమంలో మోకు జారి కిందపడ్డాడు. దీంతో తల, ఇతర భాగాలకు తీవ్ర గాయాలయ్యాయి. కిందపడిన కొన్ని గంటల తర్వాత స్థానికులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా వారు పరిశీలించగా అప్పటికే మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు కుమారులు మహేష్, సోమన్న, భార్య కనకతార ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఉపేందర్ తెలిపారు.

వివాహిత అదృశ్యం

నెల్లికుదురు: ఓ వివాహిత బిడ్డతో సహా అదృశ్యమైన ఘటన మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలకేంద్రంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్సై చిర్ర రమేష్ బాబు తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం జాలోన్ జిల్లా సిరిసా మండలం అభేదిపూర్ గ్రామానికి చెందిన గోవింద్ సింగ్, రాఖీదేవి దంపతులు జీవనోపాధి కోసం నెల్లికుదురు మండలకేంద్రంలో నివాసం ఉంటున్నారు. మూడేళ్లుగా పానీ పూరి బండి నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. వీరికి 15 నెలల బాబు ఉన్నాడు. ఈ నెల 5న తన కుమారుడు, భార్య రాఖీదేవి అదృశ్యమయ్యారని, చుట్టు పక్కల వెతికినా కనిపించడం లేదని భర్త గోవింద్‌సింగ్ ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

బీరు సీసాలో చెత్త!

- వైన్‌షాపు ఎదుట ఆందోళన


బీరుసీసా అడుగు భాగంలో వచ్చిన చెత్త

కేసముద్రం: బీరు సీసాలో చెత్తాచెదారం వచ్చిన సంఘటన మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి మండల కేంద్రంలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇనుగుర్తి మండల కేంద్రంలోని లక్ష్మీ వైన్ షాపులో కొందరు వ్యక్తులు కలిసి బీర్లు కొనుగోలు చేశారు. ఈ క్రమంలో ఆ బీర్లను తాగే క్రమంలో ఓ బీరుసీసా అడుగు భాగంలో చెత్త (వ్యర్థపదార్థం) కనిపించింది. దీంతో ఆగ్రహానికి గురైన సదరు వ్యక్తులు వైన్‌షాపు వద్దకు చేరుకుని ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న ఎస్సై మురళీధర్‌రాజు సంఘటన స్థలానికి చేరుకుని ఆందోళనకారులను శాంతింపజేశారు. కంపెనీ నుంచి వచ్చిన బీరుసీసాలనే తాము విక్రయిస్తున్నామంటూ షాపు నిర్వాహకులు చెప్పుకొచ్చారు.